
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3 | కనిష్ఠం 25.7

నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 9 మే 2025

రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

తానూర్, మే, 8 : (ఆంధ్రజ్యోతి) : రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వినయ్‌బాబు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన తానూర్‌లోని రైతువేదికలో విత్తనాలు, ఎరువుల డీలర్లకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌సీజన్‌లో కల్తీవిత్తనాలు అమ్మిన డీలర్లపై కఠినచర్యలు తప్పవని అన్నారు. ప్రతీరైతు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రసీదు ఇవ్వాలని అలాగే స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. సంబంధిత డీలర్ షాపులలో ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



అగ్ని ప్రమాదాలపై..
ప్రత్యేక కార్యాచరణ

- అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఉన్న జోన్‌గా జిల్లా
- 43 ఫారెస్ట్ రేంజ్‌లలో అప్రమత్తంగా ఉండాలని ప్రకటన
- అగ్నిప్రమాదాల సమాచార సేకరణకు శాటిలైట్ తోడ్పాటు
- ఎన్ఆర్ఎస్‌సీ సహకారంతో ఫారెస్ట్, ఫైర్ సిబ్బందికి అలర్ట్ మెసేజ్‌లు
- సరిహద్దు జిల్లాలతో సమన్వయం
- సీక్రెట్ సర్వీస్ ఫండ్ ద్వారా ఇన్ఫార్మర్లకు రివార్డులు

విలువైన అడవులలో అగ్ని ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కార్యాచరణ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కోసం గాను అటవీశాఖ అధికారులు ఉపగ్రహ సహకారం తీసుకుంటున్నారు. అలాగే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్న జిల్లాలను సైతం గుర్తించి అక్కడ ప్రత్యేకచర్యలు చేపట్టారు. ఉమ్మడి వరంగల్‌తో పాటు ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలలో ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరిగే అవ కాశాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ సర్వే నివేదిక ఆధారంగా కవ్వాల్ టైగర్ జోన్‌తో పాటు జిల్లాలో కూడా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలుగా నిర్ధారించారు. ప్రతియేటా ఫిబ్రవరి నుంచి మే వరకు అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరు గుతుండటం సహజమే. అయితే తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని మొత్తం 43 ఫారెస్ట్ రేంజ్‌లపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ రేంజ్‌ల పరిధిలోని 9,771 కంపార్ట్మెంట్‌లలో గల 1,106 ప్రాంతాలను ఫైర్ జోన్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణ కోసం సంబంధిత అటవీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ మొదలు పెట్టారు. దీనికోసం గాను సరిహద్దు జిల్లాలోని అటవీ అధికారులతో కూడా సమన్వయం చేసుకుంటూ తగినచర్యలు చేపడు తున్నారు. అడవుల్లోకి పశువుల కాపర్లు అగ్గిపెట్టెలు గానీ బీడీలు, సిగరెట్లు గానీ తీసుకువెళ్లకుండా చర్యలు చేపడుతున్నారు. దీంతో పాటు అడవులకు ఆనుకొని ఉన్న పంట పొలాలను రైతులు దగ్ధం చేయకుండా చూస్తున్నారు. అలాగే తుని కాకు సేకరణ కోసం అడవుల్లోకి వచ్చే కూలీ లపై కూడా దృష్టి పెడుతున్నారు. అడవులను ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఫారెస్ట్ ఆఫీసర్లు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను చేప డుతున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు స్థానికులు సహకరించాలంటూ కోరుతున్నారు. ఫారెస్ట్ ఆఫీసర్లంతా అడవుల్లో స్పెషల్ పెట్రో లింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే అగ్ని ప్రమాదం జరిగితే తక్షణం స్పందించే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లా అటవీ అధికారి కార్యాలయాల్లో ప్రత్యేక నియంత్రణ సమాచార గదులను కూడా ఏ ర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాల సమాచారం తెలుసుకోవడం, వెంటనే ఆ ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.


బాసర సర్కిల్ అటవీ శాఖ కార్యాలయం ఇదే

శాటిలైట్ సహకారంతో..

అగ్ని ప్రమాదాల సమాచారంతో పాటు నివారణ చర్యల కోసం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ శాటిలైట్ సహకారం తీసుకుంటోంది. దీని కోసం గాను అన్ని డివిజన్లలోను ఫారెస్ట్ సిబ్బంది సెల్‌ఫోన్లను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. దీని కోసం ప్రత్యేకయాప్‌ను కూడా రూపొందించారు. ఈ యాప్ ప్రతి ఫారెస్ట్ సిబ్బంది సెల్ ఫోన్‌లో రిజిస్టర్ అయి ఉంటుంది. అడవుల్లో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే ఆ ప్రమాద సమాచారాన్ని శాటిలైట్ సిగ్నల్ వెంటనే అటవీ సిబ్బంది సెల్ ఫోన్లకు అలర్ట్ మెసేజ్ పేరిట లోకేషన్‌తో సహా వివరాలను అందిస్తుంది. దీంతో ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తమై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది.

సీక్రెట్ సర్వీస్ ఫండ్ ద్వారా ఇన్ఫార్మర్లకు రివార్డులు

కాగా అడవుల్లో అగ్ని ప్రమాదాల సమాచారాన్ని అందించే ఇన్ఫార్మర్లకు సీక్రెట్ సర్వీస్ ఫండ్ ద్వారా నగదు రివార్డులను అందిస్తున్నారు. ఇప్పటికే చెట్ల నరికి వేత, కలప స్మగ్లింగ్ సమాచారం తెలుసుకునేందుకు అటవీ శాఖ కొన్ని కీలకమైన ప్రాంతాల్లో ఇన్ఫార్మర్లను నియమించుకున్నారు. వీరిని ప్రస్తుతం అగ్ని ప్రమాదాల సమాచారం కోసం వినియోగించుకునేందుకు నిర్ణయించారు. దీనికోసం గాను పెద్ద ఎత్తున నగదు రివార్డులను కూడా వీరికి ఇవ్వాలని నిర్ణయించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం

● శరవణన్, సీసీఎఫ్, బాసర జోన్



అడవుల్లో అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు జాయింట్ యాక్షన్ చేపడుతున్నాం. సరిహద్దు జిల్లాల ఫారెస్ట్ ఆఫీసర్లతో కోఆర్డినేషన్ చేస్తే సమాచారాన్ని తెలుసుకుంటున్నాం. అటవీ డివిజన్ పరిధితో సంబంధం లేకుండా సమీప అడవిలో అగ్ని ప్రమాదం జరిగితే అందరం బాధ్యత తీసుకుంటున్నాం. స్పెషల్ పెట్రోలింగ్‌లు చేపట్టాం. క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి డివిజన్ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్‌ను సిద్ధం చేశాం. సమాచారం అందగానే క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు వెంటనే అక్కడికి చేరుకుని అగ్ని నిరోధక చర్యలను చేపడతాయి. అలాగే అడవులకు సమీపంలో ఉన్న గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి వారి సహకారాన్ని తీసుకుంటున్నాం. అడవుల్లోకి అగ్గి పెట్టెలను గానీ, అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉండే ఎలాంటి వస్తువులను కూడా తీసుకువెళ్లకుండా నిషేధించాం. అగ్ని ప్రమాదాల సమాచారం తెలుసుకునేందుకు శాటిలైట్ సహకారం తీసుకుంటున్నాం.

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి)



కమాండ్ కంట్రోల్ కేంద్రం ఇదే.. ఇన్‌సెట్‌లో సీసీ టీవీని పరిశీలిస్తున్న దృశ్యం

ముథోల్‌లో పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలి

● నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధులతో మాజీ మంత్రి హరీష్‌రావ్


మాజీ మంత్రి హరీష్‌రావ్‌తో ముథోల్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ ప్రతినిధులు లోలం శ్యామ్ సుందర్, డా. కిరణ్ కోమ్రేవార్

భైంసా, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుక రావాలని ఆ పార్టీ ముథోల్ ప్రతినిధులకు మాజీ మంత్రి హరీష్‌రావ్ సూచించారు. గురువారం మాజీ మంత్రి జోగురామన్న సారధ్యంలో బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధులు లోలం శ్యామ్‌సుందర్, డా. కిరణ్ కోమ్రేవార్‌లు హైదారాబాద్‌లో మాజీ మంత్రి హరీష్‌రావ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంలో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని రాజకీయ తాజా పరిస్థితులు, బీఆర్ఎస్ స్థితి,గతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై ప్రజాభిప్రాయాలు తదితర అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి హరీష్‌రావ్ ముథోల్ పార్టీ ప్రతినిదులకు బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు అనుసరించాల్సిన విధానాలపై దిశ, నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామ గ్రామాన పర్యటనలు చేపడుతూ ఆయా గ్రామాల పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ మమేకం అవ్వాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇదే సమయంలో గత దశాబ్ద కాలంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి,చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామగ్రామాన వివరించాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్


వేంకటేశ్వర వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న రితేష్ రాథోడ్

కడెం, మే 8 (ఆంధ్రజ్యోత) : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్ పేర్కొన్నారు. గురువారం కడెం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలకు హాజరై, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రితేష్‌రాథోడ్‌ని ఘనంగా సన్మానించారు. ప్రజలందరూ భక్తి భావాన్ని అల వర్చుకోవాలని, నిత్యపూజలతో ఏకాగ్రత పెరిగి, జీవన ప్రయాణం సాఫల్యం అవుతుం దని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు జక్కుల సత్తయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకోండి

కుంటాల, మే, 8 : (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరు చుకోవాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా కుంటాల మండలాన్ని భూభారతి పథకానికి ఎంపిక చేయడం జరిగిందని ఇందులో భాగంగానే రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభ్యం కాక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అంబులెన్స్ సేవలు సమయానికి అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న వాహనాల వివరాలు తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వచ్చే రోగులకు తక్షణమే వైద్యం అందాలని, పేదలకు మెరుగైన వైద్యం అందుతోందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్గించాలన్నారు. వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, వైద్యాధికారులు సురేష్, సౌమ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో హత్యకు గురైన ప్రేమ్‌సాగర్ కుటుంబానికి అండగా నిలుస్తాం

ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన ప్రేమ్‌సాగర్ ఇటీవల కాలంలో అక్కడ హత్యకు గురవడం తీవ్ర విషాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితులను ఓదార్చి, వారికి తగిన ధైర్యం చెప్పారు. ప్రేమ్‌సాగర్ హత్య చాలా బాధాకరం. ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, పిల్లల విద్య కోసం అన్ని విధాల తోడుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రేమ్‌సాగర్ భార్య ప్రమీల, పిల్లలు, తల్లి లక్ష్మీ, ఇతర కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌ను కలిసిన ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్


ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

కడెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్, పెద్దూర్ గ్రామాల్లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, గన్నీబ్యాగులు, గోడౌన్‌లను జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన తేమ శాతం వచ్చిన రైతులకు ఎలాంటి విమర్శలకు తావు లేకుండా సీనియార్టీ ప్రకారమే గన్ని బ్యాగులను కేటాయించాలని దీనికి సంబంధించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. మండలంలో సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. కేంద్రాల్లో నోటీస్ బోర్డు, ఫ్లెక్సీలను, రైతులకు నీడ కోసం టెంటు, త్రాగునీరు, ప్రథమ చికిత్స కిట్ వంటి సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని సెంటర్ నిర్వాహకులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుధాకర్, జిల్లా సహకార అధికారి పాపయ్య, మండల తహసీల్దార్ ప్రభాకర్, గిర్దావర్ శారద, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి సంస్థకు రాష్ట్ర స్థాయి అవార్డు

నిర్మల్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) రాష్ట్రస్థాయి అవార్డును కైవసం చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేయడమేకాక, రుణాల రికవరీలోను రాష్ట్రంలో ప్రథమస్థానాన్ని సాధించింది. ఈ కృషికి గాను హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్ సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మీ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, డీపీఎం జ్ఞాను, ఏపీఎం సుదర్శన్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు రావడానికి ప్రోత్సాహం కల్పించిన కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న దృశ్యం

ప్రధాని బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి బాల పురస్కారాల కోసం జూలై 31 లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో సృజనాత్మక, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సాంస్కృతిక తదితర రంగాల్లో ప్రతిభ గల 5-18 ఏళ్ల బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8247685975, 9963738012 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం వాయిదా

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న నిర్వహించాల్సిన కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని వాయిదా వేసినట్టు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. పాకిస్తాన్‌పై భారత సైనిక చర్యకు మద్దతుగా భారత సైన్యానికి సంఘీభావం తెలిపేందుకు సమావేశాన్ని వాయిదా వేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

'జై సంవిధాన్' 11 వరకు వాయిదా

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశాలు 11 వరకు వాయిదా వేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణ, పీసీసీ అబ్జర్వర్ల తదితర సమావేశాలు వాయిదా వేయాలని శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సచివాలయం నుండి నెక్లెస్ రోడ్ వరకు ఆపరేషన్ సింధూర్ సైనికులకు సంఘీభావం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఫిలిం ఫెస్టివల్‌కు 'ప్రేమతో నాన్న' చిత్రం

నిర్మల్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన టాలీవుడ్ ఫిలిం ఫెస్టివల్‌కి ప్రేమతో నాన్న లఘు చిత్రం ఎన్నికై ప్రత్యేకంగా ప్రదర్శించారని దర్శకుడు డాక్టర్ వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణని టాలీవుడ్ దర్శకులు మోహన్, ప్రముఖ దర్శకులు సముద్ర, శివ, దైవజ్ఞశర్మ, నిర్మాతలు పద్మని, మురళీధర్, విశ్రాంత న్యాయాధికారి మల్హాద్రి, విశ్రాంత ఎమ్మార్వో సత్యానందం, తదితరులు అభినందించారు.

బీసీ మేలు కొలుపు

రథయాత్రను జయప్రదం చేయండి

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9 శుక్రవారం నిర్మల్‌లో జరిగే బీసీ మేలుకొలుపు రథయాత్ర జయప్రదం చేయాలని బీసీ జేఏసీ కోరింది. గురువారం నాయకులు లింగన్న, అమరవేణి నర్సాగౌడ్, అనుముల భాస్కర్, తదితరులు ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు పెన్షనర్ల సంఘ భవనంలో సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. అన్ని బీసీ సంఘాలు, కుల సంఘాలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

బీడీ కార్మిక సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న దేశ వ్యాప్తంగా బీడీ కార్మికులు చేపట్టే సార్వత్రిక సమ్మె నోటీసును గురువారం టీయూసీఐ నాయకులు సోఫీనగర్ బీడీ కంపెనీ యాజమాన్యానికి అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ... కేంద్రం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సార్వత్రిక సమ్మె చేస్తున్నట్టు తెలిపారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

మహారాష్ట్ర జొన్నలు రాకుండా తనిఖీలు

తలమడుగు, మే8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమంగా జొన్నలు రాకుండా పకడ్బందీగా తనిఖీలు చేపడుతున్నామని వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి తెలిపారు. తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని ఈ ఆయన సందర్భంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి కొంతమంది దళారులు తక్కువ ధరకు కొనుగోలుచేసి ఆదిలాబాద్ మార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. మహారాష్ట్ర నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జొన్నలు తరలిస్తే బాధ్యులపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. లక్ష్మంపూర్ చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నారన్నారు. అలాగే తెలంగాణ ప్రాంతం ఆదిలాబాద్ జిల్లా నుంచి మహారాష్ట్రకు ఎలాంటి అనుమతులు లేకుండా పత్తి విత్తనాలు తీసుకెళ్లవద్దన్నారు. ఎవరైనా తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చెక్‌పోస్టు సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మడావి రమాదేవి

నేరడిగొండ/సోనాల, మే8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోగల ఆడే గజేందర్ క్యాంపు కార్యాలయంలో సోనాల మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకురాలు మడవి రమాదేవిని గురువారం కండువా కప్పి కాంగ్రెస్‌పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మడవి రమాదేవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేస్తున్న కృషి, అభివృద్ధిని చూసి పార్టీలో చేరానని అన్నారు. కార్యక్రమంలో సోనాల మండల సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, సద్దాం, పాల శంకర్, కపిల్ దేవ్ పాల్గొన్నారు.

హమాలీలు కష్ట జీవులు: ఎమ్మార్పీఎస్

బోథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): హమాలీలు ఎంతో కష్టపడుతూ జీవనం సాగిస్తున్నారని, వారిని కొంతమంది నాయకులు దోపిడీదారులుగా అభివర్ణించడం సరైనదికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి అన్నారు. గురువారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడారు. కొంతమంది వ్యక్తులు కావాలని హమాలీలను దొంగలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వారిని దొంగలుగా చిత్రీకరించేలా మాట్లాడినవారు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే హమాలీలు తమ సత్తాను చాటుతారన్నారు. ఆయనవెంట ఎమ్మార్పీఎస్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

'అన్నం పెట్టే భాగ్యం కలగడం అదృష్టం'

బోథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): పదిమందికి పట్టెడు అన్నం పెట్టే కష్టజీవులకు అన్నం పెట్టే భాగ్యం కలగడం తన అదృష్టమని బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి రాజు యాదవ్ పేర్కొన్నారు. గురువారం మార్కెట్ యార్డులో జొన్నపంటను అమ్మేందుకు వచ్చిన రైతాంగానికి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జొన్న విక్రయాలు పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమానికి కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకారసంఘం డైరెక్టర్ ఉమేష్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

• ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



ఉట్నూర్ పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

ఉట్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు కేసుల రికార్డులను నవీకరిస్తూ ఉండాలని, పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, నిర్వహించే విధులపై సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. పోలీసుస్టేసన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా చూడాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ త్వరితగతిన న్యాయం చేసేలా సిబ్బందికి విధులు కేటాయించాలన్నారు. పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు వాటి పురోగతి దర్యాప్తుపై విచారణ చేపట్టారు. పోలీసుస్టేషన్ ఆవరణ పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును పూర్తిచేసి కోర్టులో చార్జీ షీటు దాఖలు చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా ఖచ్చితమైన గస్తీ నిర్వహిస్తూ అరికట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించే ప్రయత్నం చేయాలన్నారు. ముఖ్యంగా పోలీసు స్టేషన్‌లో కేసుల నమోదులో జాప్యం జరగకుండా చూడాల న్నారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ, ఎలాంటి అవినీతికి పాల్పడకుండా నిజాయితిగా ఉండాలని సూచించారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కరంజి (టి) ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

'ఆపరేషన్ సింధూర్'పై విజయోత్సవం

భీంపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌పై భీంపూర్ మండల కరంజి(టి) గ్రామంలో గురువారం విజయోత్సవర్యాలీ నిర్వహించారు. పార్టీ, కులమతాలకు అతీతకంగా గ్రామస్థులంతా ఐక్యంగా డప్పు వాయిద్యాలతో ప్రధానవీధుల గుండా తిరుగుతూ భారత్‌మాతాకి జై అంటూ తిరిగారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. భారతదేశం మరిన్ని సైనిక చర్యలతో ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణరావును మాజీ మంత్రి జోగురామన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎస్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలు, ఇతరాత్ర విషయాలపై చర్చించారు. ఇందులో అష్రాఫ్ ఉన్నారు.

జిల్లాలో పోలీసుల సెలవులు రద్దు

బోథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రపోలీసుశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో భాగంగానే జిల్లాలో పోలీసులకు సెలవులు రద్దు చేసినట్లు తెలిసింది. జిల్లా పోలీసుబాస్ ఎవరికీ సెలవులు ఇవ్వవద్దని, అందరూ విధుల్లోఉండేలా పోలీసుఅధికారులు చూడాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో దీనితో సెలవుల్లో ఉన్న పోలీసులు తిరిగివిధుల్లో చేరుతుండగా.. సొంతపనులపై సెలవులు పెట్టేందుకు సిద్ధమైన పోలీసులకు సెలవులు రద్దుచేస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

• మండల విత్తన డీలర్లకు అవగాహన సదస్సు



విత్తన డీలర్లకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఇచ్చోడ, మే8 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో విత్తన డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా నకిలీ విత్తనాలు అమ్మితే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఏఈఓలు మీ క్లస్టర్ పరిధిలో ఉన్న రైతులకు విత్తనాలు, విత్తన కంపెనీలపై, కొనుగోలుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, మహిళా ఎస్సై పద్మ, ఏఓ రమేష్, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

ఆగుతూ.. సాగుతూ!

(5వ పేజీ తరువాయి..)

వస్తుందని రైతులు చెబుతున్నారు.

• ప్రతీసారి ఆలస్యమే..

సకాలంలో కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో ప్రతీసారి జొన్నపంట కొనుగోళ్లు ఆలస్యంగానే జరుగుతున్నాయి. ఇచ్చోడ మార్కెట్‌యార్డులో గత 10 రోజులుగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే బోథ్, ఆదిలాబాద్ మార్కెట్‌లలో కొనుగోళ్ల ప్రక్రియ నెమ్మదిగా సాగుతుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పో సప్పో చేసి పంట కోతలు, నూర్పిడి చేసిన రైతులు పెట్టుబడి వ్యయం పేరిటా ఆదరబాదరగా అమ్మేసుకుంటున్నారు. ప్రభుత్వమే ముందుచూపుతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఉంటే రైతులకు ఇబ్బందులు ఉండేవి కాదంటున్నారు. మద్దతు ధరను ప్రకటించి సకాలంలో కొనుగోలు ప్రక్రియను చేపడితేనే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. క్వింటా మద్దతు ధర రూ.3371 కాగా ప్రైవేట్‌లో రూ.2500 నుంచి రూ.3వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.300 నుంచి రూ.800 వరకు రైతులు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి వేచిచూసే ఓపిక లేక దళారులకు దళారులకు అమ్మేసుకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులకు అవకాశం ఇవ్వకుండా ముందు చూపుతో వ్యవహరిస్తే జిల్లా రైతులకు మద్దతు ధర కలిసి వచ్చే అవకాశం ఉంటుంది.

• కొందరికే మద్దతు ధర

కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు ఆధరబాధరగా అమ్మేసుకుంటున్నారు. దీంతో కొందరికే మద్దతు ధర దక్కే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే 20 శాతం పంట దిగుబడులను పెట్టుబడి ఖర్చులు, అత్యవసరాల పేరిటా అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న దళారులు నాణ్యత లేదంటూ ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. తీవ్రమైన ఎండలు, ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలతో తక్కువ ధరకే పంటను అమ్మేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మద్దతు ధర అందక రైతులు నష్టపోతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదంటున్నారు. కొన్ని మార్కెట్ యార్డుల్లో దళారుల నుంచి భారీగా జొన్న పంటను కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలకు పంట దిగుబడులు తడిసి పోతే మద్దతు ధరలో కోతలు విధించే అవకాశం ఉంటుంది. ఈసారి కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. మరోపక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలుకానుంది. దీంతో రైతులు పంటల సాగు పనుల్లో నిమగ్నమవుతారు. ఆ లోపే జొన్నపంట కొనుగోళ్లను పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'రాజ్యాధికారమే అన్నింటికీ పరిష్కారం'

ఇచ్చోడ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీసీ,ఎస్సీ, ఎస్టీ ప్రజలకు రాజ్యాధికారమే శాశ్వత పరిష్కారమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రలో భాగంగా కోకస్‌మన్నూర్ గ్రామంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. ప్రజాసమస్యల్ని ప్రభుత్వసంక్షేమ కార్యక్రమాలు వందశాతం అమలు అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పౌరసరఫరాల గిడ్డంగిని పరిశీలించారు. పేదవర్గాల వారికి విద్య, వైద్యం ఉపాధి, భూమి, ఇల్లు సాధించేందుకే మా భూమి రథయాత్రను చేపట్టామన్నారు. ఇచ్చోడ పీహెచ్‌సీలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరా గిడ్డంగిలో స్వయంగా బియ్యం సంచి మోసి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, మండల నాయకులు శేఖర్, లక్ష్మణ్, ప్రవీణ్, పవన్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు: డీఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ప్రధానచౌక్‌తో పాటు పబ్లిక్ ప్లేస్ ల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేవారు మున్సిపాలిటీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు, సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నీటి నమూనాలను సేకరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

కుబీర్, మే, 8 : (ఆంధ్రజ్యోతి) : కలుషిత నీటి సరఫరాతో మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 5న ప్రచురితమైన 'బురద చేరి రంగు మారి' అనే కథనానికి స్పందన లభించింది. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు ఆదేశానుసారం గురువారం మండల కేంద్రంలోని శివసాయి కాలనీ, శ్రీరాంనగర్ కాలనీల్లో గల మిషన్ భగీరథ కులాయిల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ సంపత్‌తో పాటు పలువురు సిబ్బంది నీటి నమూనాలను సేకరించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు పాటిస్తామన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్రాల వద్ద తూకంలో బస్తా బరువు 41 కిలోలు మాత్రమే ఉండాలన్నారు. రవాణా, రైస్ మిల్లర్లతో ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తేవాలన్నారు. 9492776975 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

అనంతపేట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



నిర్మల్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతపేట్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూతాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, ఏపీఎం భోసు, సీసీ సంతోష్ కుమార్, నర్సయ్య, ఇతర లీడర్స్, గ్రామ సెక్రటరీ కృష్ణచారి, వీడీసీ సభ్యులు, గ్రామంలోని రైతులు, వీవో అధ్యక్షురాలు, వీవో సభ్యులు, ఈవో ఏ. పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సింధూర్'కు మద్దతుగా ప్రత్యేక పూజలు

నిర్మల్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైనిక దళాలు దాడులు చేసి మట్టుపెట్టినందుకు మద్దతు ప్రకటిస్తూ నాయుడివాడ హనుమాన్ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైనికులకు ధైర్య స్థైర్యాలు, శక్తి అందించాలని ప్రార్థించారు. మాజీ కౌన్సిలర్ సాధం అరవింద్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలు లింగన్న, పోశెట్టి, నాయుడి రమేష్, రామ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

నిర్మల్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన శ్రీకాంత్.. అదే గ్రామానికి చెందిన బాలిక(14)తో అసభ్యకరంగా ప్రవర్తించాడని కుంటాల పోలీస్ స్టేషన్‌లో 2016 సంవత్సరంలో కేసు నమోదైంది. కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టు పోక్సో చట్టం కింద నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 4 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

అవగాహన సాగుతో అధిక దిగుబడులు

• సాంకేతిక పరిజ్ఞానంతో సులువైన యాజమాన్యం పద్ధతులు

• 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమ ప్రారంభంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు



మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

ముథోల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంపై అవగాహనతో కూడిన పంటలసాగులో నాణ్యమైన ఉత్పత్తులను, అధిక దిగుబడులను సాధించవచ్చని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్ష నమూనాలను నిర్వహించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అధిక యూరియా వాడుతున్నారని దీంతో భూసారం కోల్పోతుందని పేర్కొన్నారు. కెపాసిటీ మించి రసాయన ఎరువులు వాడ కూడదని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన సలహా, సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన భూసారం పెరగడంతో పాటు రైతుకు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. అలాగే ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానం ముథోల్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య, మాట్లాడుతూ... రైతులు భూమిని కాపాడాలని పేర్కొన్నారు. ఎక్కువ రసాయన ఎరువులతో పాటు యూరియా వలన భూమిలోని సారమంతా కోల్పోయి నిర్జీవంగా మారుతుందని దీంతో దిగుబడులు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తాము సూచించిన సలహా, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. సలహా, సూచనలకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. అలాగే ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ మాట్లాడుతూ... ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తుందని, రైతులకు ఖరీఫ్‌కాలంలో వేసే పంటల సలహా, సూచనలు ఇచ్చేందుకే ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. రైతులు విధిగా విత్తనాలు కొనేటప్పుడు తప్పకుండా విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు బిల్లు తీసుకోవాలని పేర్కొన్నారు. అయితే ఈ మధ్యకాలంలో నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్నారని తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డీఏవో అంజిప్రసాద్ మాట్లాడుతూ... రైతులకు తగు సలహా, సూచనలు ఇస్తున్నామని పాటించి అధిక దిగుబడులు పొందాలని కోరారు. ప్రతి రైతు భూమిని కాపాడుతూ యూరియా తక్కువ ఉపయోగించాలని కోరారు. అలాగే హార్టికల్చర్ జిల్లా అధికారి బి. రమణ మాట్లాడుతూ... రైతులకు సబ్సిడీ కింద ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. పామ్ ఆయిల్, పండ్ల తోటలు, తీగ జాతి కూరగాయలు తదితర వాటిపై సబ్సిడీ ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, డీఏవో అంజిప్రసాద్, హార్టికల్చర్ జిల్లా అధికారి రమణ, ఏడీఏ వినయ్‌బాబు, శాస్త్రవేత్తలు డా. విజయ్ కుమార్, డా. కార్తీక్, జావిద్, నాయకులు నర్సాగౌడ్, కోరి పోతన్న, టి. రమేష్, దేవోజి భూమేష్, సురేందర్ రెడ్డి, సాయినాథ్, రామ్‌నాథ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగంచేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని బ్రహ్మాన్‌గాం గ్రామంలో గురువారం ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సన్ ఫ్లవర్ క్వింటాల్‌కు రూ. 7,280లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కొనసాగిస్తున్న చర్చిపై చర్యలు తీసుకోండి

• లక్ష్మణచాంద ఎంపీడీవోకు కనకాపూర్ గ్రామస్థుల ఫిర్యాదు



ఎంపీడీవో రాథోడ్‌కు ఫిర్యాదు చేస్తున్న కనకాపూర్ గ్రామస్థులు

లక్ష్మణచాంద, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ గ్రామంలో అక్రమంగా కొనసాగిస్తున్న చర్చిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కొందరు గురువారం మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎస్సై సుప్రియకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశామని తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న ఇంటిలో అనుమతులు లేకుండా మైత్రి దయానంద్ అనే వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నాడని, ఇతరులను ప్రేరేపించే విధంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో పవన్, ప్రమోద్, చందు, భీమేష్, రాజు, హన్మండ్లు, శంకర్, రాజు, తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తురాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రేవోజీపేట్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 15 లక్షలతో నూతన ఆరోగ్య కేంద్ర భవనం మంజూరైందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గుండా నరేష్, నాయకులు రమేష్‌రావు, సింగరి కిషన్, శరత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ముడికే శ్రీను, రాజేందర్, రాజేశం, గోపి, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో యువకుడి అదృశ్యం

లక్ష్మణచాంద, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బైండ్ల ప్రశాంత్(32) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. గురువారం ఎస్సై సుప్రియ తెలిపిన వివరాల ప్రకారం... స్థానికుడైన బైండ్ల ఆనంద్ కుమారుడైన ప్రశాంత్ గత ఏప్రిల్ 22న సాయంత్రం 8 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయలుదేరాడు. అర్ధరాత్రి గడిచినప్పటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు మరుసటి రోజు నుంచి స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభించక పోవటంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అదృశ్యమైన వ్యక్తి చామనచాయ రంగు కలిగి ఉంటాడని, దివ్యాంగుడని, 5.6 పీట్ల ఎత్తు ఉండి వైట్ కలర్ జీన్స్ ప్యాంట్, షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిపిన వారు మొబైల్ నంబర్స్ లక్ష్మణచాంద ఎస్సై 8712659521, సోన్ సీఐ 8712659519లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆరు గ్యారంటీల అమలుకు ఉద్యమాలు చేయాలి

• సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్

నిర్మల్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ఉద్యమాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ అన్నారు. గురువారం పట్టణంలో జిల్లా కౌన్సిల్ సమావేశం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీపీఐ శాఖ మండల మహాసభలు మే, జూన్‌లలో నిర్వహించి, జూలై 6న జిల్లా మహాసభలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేష్, జిల్లా సీపీఐ కార్యదర్శి విలాస్, సహాయ కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 25 వేల విరాళం

సోన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ అభివృద్ధి కోసం భక్తులు విరాళం అందజేశారు. సారంగాపూర్ మండలం మలక్ చించోలి గ్రామానికి చెందిన సున్నం శ్రీవిద్య, బ్రహ్మయ్య దంపతులు గురువారం రూ. 25 వేల విరాళాన్ని ఆలయ గురుస్వామి నర్సారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హామీలకే పరిమితమైన సుంకిడి మార్కెట్ యార్డు నిర్మాణం

● పట్టించుకోని పాలకులు
● రైతులకు తప్పని ఇబ్బందులు

తలమడుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో మార్కెట్ యార్డు నిర్మిస్తామని గత దశాబ్దాలుగా నాయకులు, అధికారులు హామీలు ఇస్తున్నారు తప్ప నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా మార్కెట్ యార్డు నిర్మాణం కోసం తాంసి, తలమడుగు, భీంపూర్ మండల రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ ఎన్నికల సమయంలో నాయ కులు హామీ ఇస్తున్నారే తప్ప నిర్మాణం కోసం ఇలాంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుంకిడిలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం గత సర్పంచ్ హయాంలో ఐదెకరాల భూమిని తీర్మానం చేసి మార్కెట్ అధికారులకు, జిల్లా అధి కారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ వాటిని సంబంధిత శాఖ అధికారులు స్పందించడం లేదని రైతులు విమ ర్శలు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డు నిర్మాణంతో రైతులకు గ్రా మాల్లో గల యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతులకు దూర భారం తగ్గడమే కాకుండా సకాలంలో పంటలను విక్రయించు కునే అవకాశం లభిస్తుంది. మూడు మండలాల రైతులకే కాకుండా పక్క నే గల మహారాష్ట్ర రైతులకు కూడా ఉపయోగపడుతుందని రైతుల పేర్కొన్నారు. ప్రస్తుతం సుంకి డిలో ప్రతీ ఆదివారం ఏర్పాటుచేసిన మార్కెట్ సంతతో చుట్టుపక్కల గ్రామాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది కాగా గత బీఆర్ఎస్ పార్టీ హయాంలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం అసెంబ్లీలో ప్రజాప్రతి నిధులు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ హామీ ఇచ్చారు తప్ప వాటి అమలు పరచడంలో పూర్తిగా విఫలమయ్యారని రైతులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రజా పాలన భాగంగా హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలులోకి రావడం లేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి మార్కెట్ యార్డు నిర్మాణం కోసం కృషి చేయాలని రైతుల భీమా వ్యక్తం చేస్తున్నారు.



సుంకిడి శివారు ప్రాంతంలోని మార్కెట్ యార్డు కోసం గ్రామస్తులు కేటాయించిన స్థలం

మార్కెట్ యార్డు నిర్మాణం కోసం ఐదు ఎకరాల భూమి

● మహేందర్ యాదవ్, మాజీ సర్పంచ్



తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం గతంలో ఐదు ఎకరాల భూమిని తీర్మానం చేసి మార్కెట్ శాఖ అధికారులకు, జిల్లా అధికారులకు పంపించడం జరిగింది. జిల్లా అధికారులు, రెవెన్యూ అధి కారులు భూమిని పరిశీలించి వెళ్లినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి త్వరగా మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలి.


సబ్ సెంటర్ ప్రారంభానికి నోచుకోకపోవడంతో పశువులకు స్థావరాలుగా మారిన దృశ్యం

ప్రారంభానికి నోచుకోని సబ్ సెంటర్

● పశువుల పాకగా ఉపయోగం ● పట్టించుకోని అధికారులు

తలమడుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంకల్పంతో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి సబ్ సెంటర్‌ను నిర్మించినప్పటికీ అవి నిర్మాణ దశలోనే ఉండడంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షలాగానే మిగిలిపోయింది. మం డల కేంద్రంలో గత రెండు సంవత్సరాల క్రితం సబ్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయల నిధులు మం జూరు చేయగా నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోవడంతో ప్రారంభానికి నోచు కోలేదు. దీంతో స్థానికులు కొంతమంది సబ్ సెంటర్ ను పశువుల పాకగా ఏర్పాటు చేసుకొని సబ్‌సెంటర్ ముందు పశువు లను పశు గ్రాసాన్ని నిల్వ ఉంచుతున్నారు. రోగులకు వైద్య సేవలు అందించాల్సిన సబ్ సెంటర్ పశువులకు స్థావరాలుగా మారడంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలో నిర్మించిన సబ్ సెంటర్‌ను ఇప్పటివరకు వైద్య అధికారులు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. అటువైపు గాని ఇప్పటి వరకు కన్నెత్తి చూడక పోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సబ్ సెంటర్ ప్రారంభానికి నోచుకోక పోవడంపై రోగులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పం దించి సబ్ సెంటర్ త్వరగా ప్రారంభించి గ్రామీణ ప్రజలకు మెరు గైన వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

బాజీరావ్ బాబా చూపిన సన్మార్గంలోనే ప్రతీఒక్కరు నడవాలి

● ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి


మేడిగూడలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

జైనథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరు తమకు ఉన్న చెడు వ్యసనాలను వీడి బ్రహ్మనిష్ట సద్గురు బాజీరావ్ బాబా చూపిన సన్మార్గంలోనే ప్రతీ ఒక్కరు నడవాలని ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గత వారం రోజులుగా జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలోని మేడిగూడ (ఆర్)లో జరుగుతున్న బాజీరావ్‌బాబా సప్తహం వేడుకల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలతో కూడిన చిన్నారులను ఎడ్లబండి పై డప్పులు భజాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు నృత్యాలు చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన మహిళలు భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఎక్‌తారాలో భక్తుడు ప్రతీ ఇంట తిరుగుతు మనిషి సన్మార్గం గురించి వివరించారు. మేడిగూడలో వెలసిన జాతర భక్తులు చిన్నారులు ఉయాలల వివిధ సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ వీడీసీ చైర్మన్ క్యాతంరాంరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ మేడపతి సీమాశ్యాంసుందర్, మాజీ ఎంపీటీసీ చిట్యాల భూమన్నలతో పాటు మేడిగూడ గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


మేడిగూడలో వివిధ దేవతల వేషధారణలో చిన్నారులు

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు

● వ్యవసాయ రంగంలో ప్రధానం కానున్న కార్డులు ● 11 అంకెలతో జారీ చేయనున్న కేంద్ర ప్రభుత్వం
● క్లస్టర్ల వారీగా రైతు నమోదు ప్రక్రియ


బైంసా, కుభీర్ మండలాల్లో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

బైంసా, మే 8 (ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని, రైతుల వివరాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగా కేంద్రం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసి తక్షణమే అమలు చేయాలని సూచించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు తమ తమ క్లస్టర్ల పరిధిలో ఉన్న రైతుల వివరాలను నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. త్వరలో మీ సేవా కేంద్రాల్లో కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

● ఆధార్‌తో అనుసంధానం..

ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాసు పుస్తకంలోని భూమి యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతుకు గుర్తింపు కార్డును కేటాయిస్తారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, అనుసంధానం చేసిన ఫోన్ నంబర్‌తో మండల వ్యవసాయ అధికారి లేదా ఏఈవోల వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలి. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత ఫోన్‌కి ఓటీపీ వస్తుంది. దాని ధ్రువీకరణ ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. కార్డును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

● ఈ సంఖ్యను కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు అనుసంధానం చేస్తారు.

● కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఫసల్ బీమా యోజన, పీఎం కిసాన్ యోజన, రాయితీపై ఎరువులు, యంత్ర పరికరాలను పంపిణీ చేస్తుంది. ఇవి పొందాలంటే ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారు.

● పీఎం కిసాన్ యోజన తదుపరి విడత నిధులు విడుదల కావాలంటే ఈ విశిష్ఠ కార్డు సంఖ్య రైతుల దగ్గర తప్పక ఉండాలి.

జిల్లా సమాచారం

వ్యవసాయ డివిజన్లు: 4, క్లస్టర్లు: 79, సాగు విస్తీర్ణం: 4.35 లక్షల ఎకరాలు,

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

అంజి ప్రసాద్, డీఏవో, నిర్మల్


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అంజీ ప్రసాద్

ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో ఏవోలు లేదా ఏఈవోల వద్దకు వెళ్తే రెండు నిమిషాల్లో నమోదు పూర్తవుతుంది.

తడి లేదు.. పొడి లేదు

● పంచాయతీకీ ఆదాయం లేదు
● అలంకార ప్రాయంగా సెరిగేషన్ షెడ్లు

తలమడుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య నిర్మాణాల కోసం ప్రతీ గ్రామంలో లక్షల వ్యయంతో నిర్మించిన సెరిగేషన్ షెడ్లు అలంకార ప్రాయంగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. పంచాయతీకి ఆదాయం లేదు, ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సిరిగేషన్ షెడ్లలో తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగా చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇక్కడ కూడా సేంద్రీయ చెరువులు తయారవుతున్నట్లు దాఖలాలు కనబడడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్త మవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సెరిగేషన్ షెడ్లు అక్రమ కలాపాలకు అడ్డగా మారాయని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాలు ఏర్పాటు చేసిన షెడ్లలో చెత్త వేయక పోవడంతో మద్యం ప్రియులకు. అడ్డాగా మారాయి. కాగా వాటిని పరిరక్షించిన అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామీణ ప్రజలు తెలిపారు. గ్రామంలో విధులు నిర్వహించే పంచాయతీ సెక్రెటరీలు సర్వేల మీద సర్వేలు రావడంతో, అధికారులు సర్వేలకే పరిమితమవుతున్నారు. అంతే కాకుండా కొన్ని గ్రామ పంచాయతీలో, మురికి కాలువలు నిండి పోయి, రోడ్ల మీదనే ప్రవహించి దుర్వాసన వస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి షెడ్లలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ మొక్కలకు అందేవిధంగా చూడాలని కోరుతున్నారు.



గ్రామాల్లో అలంకారప్రాయంగా ఉన్న సెరిగేషన్ షెడ్లు

భైంసాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, మే 8 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్ లోని పహెల్గాంలో జరిగిన ఘటనకు ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి మట్టుబెట్టాడాన్ని పురస్కరించుకొని గురువారం భైంసాలో బీజేపీ సంబరాలు జరుపుకుంది. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ నేతృత్వంలో బీజేపీ శ్రేణులు స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ప్రధాని మోడీకి అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేపట్టారు. ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. పహెల్గాం ఘటనకు భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. ప్రధాని మోడీ సారథ్యంలోని భారత సైన్యం ఉగ్రవాదులతో పాటు వారి శిబిరాలను ధ్వంసం చేసిందన్నారు. ఉగ్రమూకలకు ఊతమిస్తున్న, ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు సరైన రీతిలో గుణపాఠం నేర్పిందన్నారు. అన్ని వర్గాల ప్రజానీకం భారత ప్రభుత్వానికి సైన్యానికి అండదండగా నిలువాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సుష్మారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు యనుపోతుల మల్లేశ్వర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కపిల్ సింధే, పార్టీ ప్రతినిధులు సోలంకీ భీంరావు, వడ్నపు శ్రీనివాస్, తూమోల్ల దత్తు, రావుల పోశెట్టి పాల్గొన్నారు.

తెలంగాణ తిరుపతి బరంపూర్ గుట్టకు రహదారుల కష్టాలు

● హామీలకే పరిమితమైన నేతల హామీలు
● భక్తులకు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు


బరంపూర్ తిరుమల గుట్టకు గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్లు

తలమడుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై వెలసి తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న బరంపూర్ తిరుమల గుట్టకు వెళ్లే భక్తులకు రహదారి కష్టాలు తప్పడం లేదు గుట్ట వరకు రోడ్డు నిర్మాణం కోసం నాయకులు హామీలు ఇస్తున్నారా తప్ప అవి అమలుకు నోచుకోవడం లేదు. బరంపూర్ గ్రామం లో నుంచి కొండపైకి వెళ్లాలంటే దాదాపు మూడు కిలోమీటర్ల వరకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడి వరకు వెళ్లాలంటే సరైన బీటీ రోడ్డు లేక రాళ్ల రప్ప లతో కూడిన మట్టిరోడుతోనే భక్తులు ప్రయాణికులు వెళ్లవలసిన పరి స్థితిలో ఏర్పడుతున్నాయి. అదేవిధంగా సకినాపూర్ నుంచి బరంపూర్ వరకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ఆదివాసి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా బరంపూర్ నుంచి అర్లికే వరకు రోడ్డు నిర్మాణం కోసం నాయకులు భూమి పూజ చేసినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. బరంపూర్ నుంచి కొండ వరకు బీటీ రోడ్డు నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చి సన్మానాలు చేసుకుంటున్నారే తప్పా రోడ్డు నిర్మాణం గురించి ఎవరు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి లింకు రోడ్లను బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

దారంతా పచ్చతోరణం

ఆదిలాబాద్ జిల్లాలో గల పల్లె, పట్టణ ప్రాంతాల్లోని పలు రహదారులు హరిత శోభను సంతరించుకున్నాయి. మండు వేసవిలోను రోడ్డువెంటా పచ్చతోరణంలా చూపరులను, ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ దారుల వెంట వెళ్లే పాదచారులు, వాహనదారులను సహజ సిద్ధమైన పచ్చందాలతో కట్టి పడేస్తున్నాయి. రంగురంగుల పూలతో మనసును దోచుకుంటున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంతో కనువిందు చేస్తున్నాయి.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ఫొటో న్యూస్


ఆదిలాబాద్ కలెక్టర్ ఆఫీస్ రోడ్డు


న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ


భీంపూర్ రోడ్డు


కేసీబీ రోడ్డు


సోనాల మండలం గుర్రాల తండా గ్రామం..





• పంట చేనులో జొన్న కుప్పల పై పాలిథిన్ కవర్లను కప్పుతున్న రైతు

ఆగుతూ.. సాగుతూ!

• జిల్లాలో ఎక్కడి జొన్నలు అక్కడే.. • మందకొడిగా జొన్నల కొనుగోళ్లు
• అన్నదాతలను వెంటాడుతున్న అకాల వర్షాలు • అత్యవసరాల పేరిట అమ్మేసుకుంటున్న రైతులు • ప్రభుత్వ మద్దతు ధరపై గల్లంతవుతున్న ఆశలు
• రోజుల తరబడి పంట కుప్పల వద్దనే పడిగాపులు

ఆదిలాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): జొన్న పంట చేతికొచ్చి పక్షం రోజులు గడుస్తున్నా జిల్లాలో ఎక్కడి జొన్నలు అక్కడే అన్నట్లుగా మారింది. ఈయేడు వేసవిలో రైతులు ఆరుతడి పంటలనే ఎక్కువగా సాగు చేశారు. ప్రధానంగా యాసంగిలో జొన్న, మొక్కజొన్న తదితర పంటలే ఎక్కువగా సాగయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాలు మద్దతు ధర రూ.3371గా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా లక్షా 10వేల 901 ఎకరాలలో జొన్న పంట సాగైంది. దీంతో ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కాన జిల్లాలో లక్షా 71వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరుగక పోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతీసారి కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో సగం పంట దళారుల పాలవుతునే ఉందని అన్నదాతలు వాపోతున్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని చెబుతున్నారు. కేంద్రాలను ఏర్పాటు చేసిన కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయకపోవడంతో రైతులుపడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోళ్లు నెమ్మదిగా సాగడంతో రోజుల తరబడి పంట కుప్పల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా జొన్నలను ఆరబోయడం, సాయంత్రం వేళల్లో పాలిథిన్ కవర్లను కప్పడం ఓ పనిగా మారిందంటూ రైతులు చెబుతున్నారు. అన్నదాతల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

మబ్బులతో అన్నదాతల గుబులు

పగలంతా భానుడి భగభగలు సాయంత్రం సమయంలో ఆకాశం మేఘావృతమై మబ్బులు పట్టడంతో అన్నదాతల్లో గుబులు మొదలవుతోంది. చేతికి వచ్చిన పంట చేజారి పోతుందేమోనన్న భయం వెంటాడుతుంది. ఎప్పుడు అకాల వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే చెడగొట్టు వానలు కావడంతో కంటి మీద కునుకు రావడం లేదంటున్నారు. గత వారం రోజులుగా జిల్లాలో ఈదురు గాలుల భీభత్సవం, తేలికపాటి వర్షాలు కురియడంతో అన్నదాతలను అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. వేల రూపాయలు ఖర్చు చేస్తూ పాలిథిన్ కవర్లను కొనుగోలు చేస్తూ పంట దిగుబడులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న ఈదురు గాలుల భీభత్సవానికి ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి ఉందంటున్నారు. అకాల వర్షాల పేరిట అధికారులు కొనుగోళ్లను నిలిపివేయడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. జొన్న పంటను నిల్వ చేసేందుకు సరిపడా గోదాముల వసతి అందుబాటులో లేక పోవడంతో వంతుల వారీగా పంట కొనుగోళ్లను చేపడుతున్నట్లు తెలుస్తోంది. నాణ్యత, తేమ పేరిట కొనుగోళ్లకు నిరాకరిస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే అమ్ముకోవడానికి కూడా అదే స్థాయిలో కష్టపడాల్సి

(తరువాయి 6వ పేజీలో..)



చేనులోనే ఆరబోసుకున్న జొన్న పంట దిగుబడులు

ఐదు రోజులైనా నా పంటను కొంటలేరు..



ఈ ఫొటోలో జొన్నలను తూకం వేసే కాంటపై కూర్చొని కనిపిస్తున్న రైతు పేరు గంగారెడ్డి (గంగయ్య) పిప్పల్‌ధరి గ్రామం బోథ్ మండలం. పంటను విక్రయించేందుకు గత ఐదురోజుల క్రితం బోథ్ కొనుగోలు కేంద్రానికి జొన్నలను తీసుకువచ్చాడు. కానీ అక్కడి అధికారులు ఆలస్యంగా కొనుగోళ్లు చేయడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతోపాటు తన కంటే వెనుక వచ్చిన వారి పంటను కొనుగోలు చేస్తున్నారని రోజులతరబడి ఎదురు చూసే ఓపిక లేదని గురువారం తూకం కాంటాపై కూర్చొని ఇలా నిరసన వ్యక్తం చేశాడు. దీన్నిబట్టి చూస్తుంటే జిల్లాలో జొన్న కొనుగోళ్ల పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తునే ఉంది.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోండి: కలెక్టర్

జైనథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టాన్ని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం బోరజ్ మండలం హత్తిఘాట్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతిలో రైతులు భూముల సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ శ్యామలాదేవి, ఆర్‌డీఓ వినోద్‌కుమార్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను సన్మానించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: రక్తదానం మహాదానమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఆర్‌ఐఎంఎస్ ఆడిటోరియంలో ఎన్జీవోస్ ఆధ్వర్యంలో బ్లడ్ డోనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి క్యాంప్‌ను ప్రారంభించారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను కలెక్టర్ అభినందించారు. అనంతరం పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో స్మైల్ సొసైటీ అధ్యక్షులు కేమ శ్రీకాంత్, బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్, శ్రీరాం సేనా సొసైటీ అధ్యక్షుడు శశికాంత్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అటవీ శాఖ కార్యాలయం ఎదుట గిరిజనేతర రైతుల ధర్నా

ఉట్నూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేస్తున్న వ్యవసాయ భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటాలని చూడడం సరైనది కాదని గిరిజనేతర రైతులు అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఫారెస్టు డివిజన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. చాలా కాలంగా వ్యవసాయం చేస్తున్న తమ భూముల్లో మొక్కలు తప్పవద్దన్నారు. ఈ ధర్నాలో గంగాపూర్, ఉట్నూర్, దంతన్‌పల్లి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ రేవంత్‌చంద్ర మాట్లాడుతూ 2005 కంటే ముందు సాగులో ఉన్న రైతుల జోలికి తాము వెళ్లడం లేదని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము అటవీ భూముల్లో మొక్కలు నాటే చర్యలు తీసుకుంటామన్నారు.



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనేతర రైతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ రియాజ్

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

• రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

నార్నూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. గురువారం పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి రాజ్యాంగం అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. పార్టీకి కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఇందిరమ్మ కమిటీ రూపంలో కార్యకర్తలను నియమిస్తే తమ చుట్టాలు, కుటుంబ సభ్యులకు మంజూరుచేసి ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా పనిచేసిన కమిటీపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పెద్దాంపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయ్యన, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావు లోకండే, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, మాజీ సర్పంచ్ బి.గజానంద్‌నాయక్, యువజన మండల ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్, తదితరులున్నారు.

'భూములకు పట్టాలు ఇవ్వాలి'

నార్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 1970 నుంచి ప్రభుత్వ భూములను కాస్తు చేస్తున్న ఎస్సీలకు పట్టాలు ఇవ్వాలని రాజగోండ్ సేవాసమితి జిల్లా కార్యదర్శి గెడం నిరంజన్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సైతం సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి విన్నవించినట్లుగా తెలిపారు. వారివెంట కేంద్రే సురేష్, ఇరాడే విఠల్, సంతోష్ మానే, దేవరవు చునారకర్, సురేందర్, అనిల్ దుర్గే, చరణ్, తదితరులు ఉన్నారు.

నేడు వాహనాలకు వేలం

ఇచ్చోడ, మే8 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు శుక్రవారం ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు అబ్కారీశాఖ సీఐ జుల్ఫీకర్ ఆహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ధరావత్తు సొమ్మును చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బోథ్‌లో..

బోథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఇచ్చోడ ఎక్సైజ్‌స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

రౌడీ షీటర్ అరెస్ట్.. రిమాండ్

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ 1 టౌన్ పీఎస్ పరిధిలో రౌడీ షీటర్ కద్దును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

బోథ్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతీ ఏడాది పంట మార్పిడీ పాటించినప్పుడే ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పొట్నాపూర్ రైతు వేదికలో రైతు ముందర శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో శ్రీధర్ స్వామి మాట్లాడుతూ రైతులకు పంట సాగు పైన సరైన అవగాహన కలిగించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడినట్లయితే పంటలు దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు విచ్చలవిడిగా రసాయన. ఎరువుల వాడడం వల్ల ఆహర కల్తీ ఏర్పడడంతో పాటు పెట్టుబడులు సైతం పెరుగుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడి నేలతల్లిని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. విత్తనాలు కొన్నప్పుడు రసీదులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌తో బొడ్డు గంగారెడ్డితో పాటు సహకార సంఘం డైరెక్టర్ రాజు యాదవ్, షేక్, ఏఈవోలు పాల్గొన్నారు.



రైతులకు సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

టీకాలతో వ్యాధుల నివారణ

తలమడుగు, మే8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులకు సోకే వ్యాధులను టీకాలతో నివారించవచ్చుని మండల పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం భాగంగా ఆమె మాట్లాడారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. అలాగే రబీ పంటలో రైతులు జొన్నపంటను సాగుజొన్న పంట తీసిన తర్వాత పంట పొలాల్లో లేత ఆకులు వస్తాయని, వాటిని పశువులు తినకుండా చూడాలన్నారు. పశువులు ఎక్కువ ఎండలో వెళ్లకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పశువులకు టీకాలు వేయించారు. ఇందులో పశువైద్య సిబ్బంది లావణ్య, పవన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

ఉట్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దంతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నరేందర్‌రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆశావర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభిందనీయం : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌అధ్యక్షుడు దినేశ్‌మాటోలియ, కందుల రవీందర్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాస్తారోకో

• ఇందిరమ్మ కమిటీ రద్దుచేయాలి • పేదలకు ఇళ్లు ఇవ్వాలి • మద్దతు పలికిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్



ధర్నా చేస్తున్న ప్రజలు, పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నార్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలంటూ మండల కేంద్రానికి చెందిన సామాన్య ప్రజలు, మహిళలు గురువారం స్థానిక గాంధీ విగ్రహం దగ్గరా భారీఎత్తున్న రాస్తారోకో చేశారు. ఇందిరమ్మ కమిటీ రద్దు చేయాలి ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పూర్తిగా మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం కార్యకర్తలను అడ్డుపెట్టి పేదలకు అన్యాయం చేస్తోందని అన్నారు. ప్రభుత్వం వారిదైనప్పుడు అధికారులు వారు మీరు చెప్పిందే వింటారని అన్నారు. అసలైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. ఇందిరమ్మ కమిటీకి సంబంధం లేకండా ఇళ్లు ఇవ్వాలని, లేనిఎడల పెద్దఎత్తున్న ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్ దృష్టి పెట్టి పేదలకు గుర్తించాలని కోరారు. గత నెలలోనే దేశ ప్రధాని మోదీ చేతులమీదుగా ద్వారా మండలానికి అవార్డ్ వచ్చిందని, అక్కడఅందరూ గౌరవిస్తే ఇక్కడమాత్రం అధికారుల పనితీరుపై సామాన్య ప్రజలు రోడ్డుపై ధర్నాలు చేయడం చాలా బాధాకరం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కురాథోడ్, పెసా కమిటీ కోఆర్డినేటర్ సికేందర్ రాథోడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుల చాలుర్కర్ ప్రకాష్, రాజు బర్కుంబే, షేక్‌సద్దాం, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జిల్లా పెల్లి నవీన్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ప్రభాకర్

ఇందిరమ్మ ఇళ్ల విషయంపై డీఎల్పీఓ ప్రభాకర్ మండల అధికారులు, ఇందిరమ్మ కమిటీ, గ్రామస్థులతో సమీక్ష నిర్వహించారు. సంబంధిత అంశాలపై ఆరా తీశారు. లబ్దిదారుల ఎంపిక విషయంలో గ్రామాల్లో ప్రజల నుంచి భారీ ఎత్తున్న వ్యతిరేకత రావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామస్థుల సంబంధిత అంశాలపై వాస్తవాలు అడిగారు తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్, సూపరింటెండెంట్ గంగాసింగ్, కార్యదర్శి మోతీరాం, పెసా కమిటీ కోఆర్డినేటర్ రాథోడ్ సికెందర్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు బీజేపీ నాయకులు, మహిళలు ఉన్నారు.

అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

• మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్

ఆదిలాబాద్ అర్బన్, మే8 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే పాయలశంకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు న్యాయం చేయాలన్న సదుద్దేశంతో పత్తి కొనుగోళ్ల అవినీతిపై ప్రశ్నించిన మాజీ మంత్రి జోగురామన్నను హేళన చేసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రైతుల పక్షపాతిగా వారికి ఎల్లవేళల అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో అండగా నిలబడుతున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నదాతల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన వెంట ఇందులో యాసంనర్సింగ్‌రావు, చందాల రాజన్న, సేవ్వ జగదీశ్, ఇజ్జగిరి అశోక్, ఉగ్గేవిఠల్, ముఖీమ్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

'ప్రతీ పల్లెలో బీసీల జెండా ఎగురవేస్తాం'



జిల్లాలో మేలుకొలుపు రథయాత్ర

ఆదిలాబాద్ రూరల్, మే8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న బీసీ మేలుకొలుపు రథయాత్ర గురువారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చేరుకుంది. జక్కని సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న యాత్రలో బీసీ నేతలు పాల్గొని జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్యాఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాల్లో వాటాను అందించాలని మేమెంతో మాకంత వాటాకావాలని నినాదించారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సరైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా పేదవారుగా ఉన్నారన్నారు. దేశంలో మెజార్టీప్రజల లక్ష్యాలను పక్కనపెట్టి కార్పొరేటీకరణకు, పెట్టుబడి దారులకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయని, విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జక్కుల సత్యనారాయణ, దాసరి రమేష్, బొమ్మకంటి రమేష్, ఎర్రం నర్సింగ్ రావు, ఉదరి నగేష్, అల్లూరి భూమన్న పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తున్న వ్యక్తికి రిమాండ్

ఉట్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్(బి) ప్రాంతంలో గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని రిమాండ్ చేసినట్లు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ అక్బర్ హుస్సేన్, ఉట్నూర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. నర్సాపూర్(బి)లోని ఆడగూడ గ్రామానికి చెందిన బాజీరావు తన ఇంటి పెరటిలో గంజాయి సాగు చేస్తున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 50వేల విలువ గల 9 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై మురళి, హెడ్‌కానిస్టేబుల్ రవి, అశ్విక్, కానిస్టేబుల్ సందీప్, ఈశ్వర్, జమీల్, మేరి, ఆశన్న, స్రవంతి, గంగాధర్‌లు పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం'

గుడిహత్నూర్, మే8 (ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడే శీల అన్నారు. గత కొన్నినెలలుగా మండలకేంద్రంలోని జవహర్ నగర్ కాలనీ వాసులు తీవ్రమైన నీటి సమస్య ఉందని, ఆమెకు తెలుపగా గురువారం బోర్ వేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగ్ నాథప్పా, డాక్టైలాష్, అంకతి రవి, ససానే మాధవ్, మోహితే మారుతీ, చట్ల మహేందర్, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.